క్లుప్తంగా

ట్యూషన్ చెప్పే టీచర్లు దరఖాస్తు చేసుకోవాలి

నరసరావుపేట: పల్నాడు జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదోతరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ట్యూషన్ చెప్పేందుకు అర్హత కలిగిన టీచర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ట్యూషన్ చెప్పేందుకు నెలకు రూ.1,500లు గౌరవ వేతనం అందజేయడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్, సైన్సు, ఫిజిక్స్, మ్యాథ్స్ క్లాసులకు సంబంధించి ట్యూషన్ చెప్పాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

రైతుకి ఆర్థిక పరిపుష్టి కల్పించండి

నరసరావుపేట: రైతులకు సకాలంలో పంట, బంగారు రుణాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రొంపిచర్ల మండల పీఏసీఎస్ చైర్‌పర్సన్ మేడికొండ వీరారెడ్డికి సూచించారు. నూతనంగా ఎన్నికైన వీరారెడ్డి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సత్కరించారు. మండల నాయకులు పడాల చక్రారెడ్డి, కురుకుంట్ల శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, పి.మల్లికార్జున్‌రెడ్డి, మేడికొండ రవి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినుకొండలో సేవాసంఘం అన్నదానం

వినుకొండ(నూజెండ్ల): విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆ సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సభ్యుల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గంగినేని వెంకటేశ్వరరావు, బీపీఎస్ సుందరరావు, రామలింగేశ్వరరావు, వై.వి. సుబ్బయ్యశర్మ, ఎ. నాగేశ్వరరావు, ఆదిరాములు, కోటేశ్వరరావు, ఎం.వి. శర్మ, శాస్త్రి, వెంకటేశ్వరరావు, జోజయ్య, రాఘవయ్య, వెంకటస్వామి, నాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

7 వరకు విద్యుత్ ఉద్యోగులు ఖచ్చితమైన పనివేళలు

నరసరావుపేట: విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు తమ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నుంచి సోమవారం 7వ తేదీ వరకు ఖచ్చితమైన పని వేళలు (వర్క్‌టు రూల్) పాటిస్తారని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30వరకు మాత్రమే పనిచేస్తారన్నారు. పనివేళలు దాటిన తర్వాత విద్యుత్ సరఫరా ఆగితే తదుపరి పనివేళల్లో మాత్రమే ఆ సమస్య పరిష్కరించబడుతుందన్నారు. ప్రజలు, వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని...

యడ్లపాడు: బైక్ స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళ్లే క్రమంలో యడ్లపాడు మండలం వంకాయలపాడు హైవేపై బైక్, స్కూటీలు ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న షేక్ అలీ, గౌసియాలకు స్వల్ప గాయాలు కాగా, స్కూటీపై ఉన్న షబానకు కాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు షబానా కాటూరు మెడికల్ వైద్యశాలకు తరలించారు.

అక్షరాస్యత శాతం పెంచేందుకు చర్యలు



సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: అక్షరాస్యత శాతం పెంచేందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడిబయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంతో పాటు జగనన్న తోడు 7వ విడత పథకంపై విద్యాశాఖ అధికారులు, సచివాలయ వేల్ఫేర్ సహాయకులు, వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 0–8 నుంచి 18 సంవత్సరాల లోపు కల్గిన చిన్నారులను 1174 మందిని గుర్తించామని, సచివాలయ వేల్ఫేర్ సహాయకులు, వలంటీర్లు, సీఆర్‌పీలు సమన్వయంతో గుర్తించిన చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారందరు బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే చిరు వ్యాపారులు జగనన్న తోడు 7 విడతలో భాగంగా 366 మంది లబ్ధిదారులను రుణాలు ఇవ్వటానికి లక్ష్యంగా ఎంచుకున్నామని, అందులో భాగంగా రుణాలు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు రూ. 13 వేలు చొప్పున రుణాలు పెంపుదల ప్రభుత్వం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, ఏపీయం జి.వాసుబాబు, సీసీ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



కల్యాణ మండపం నిర్మాణ పనులపై గ్రామస్తులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరుతల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆ గ్రామంలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపాన్ని, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాలయం, కల్యాణ మండపం నిర్మాణ పనులపై సమీక్షించారు. అనంతరం రామిరెడ్డిపాలెం గ్రామంలో పర్యటించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో శ్మశాన వాటికలో జరుగుతున్న లెవలింగ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, నాయకులు కురుగుంట శ్రీనివాసరెడ్డి, బీరం భాస్కర్ రెడ్డి, చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, మాజీ ఎంపీటీసీ వనిపంట రమణారెడ్డి, రామిరెడ్డిపాలెం సర్పంచ్ ఇండెల శ్రీనివాసరెడ్డి, రాజనాల పోలిరెడ్డి, నాగిరెడ్డి, పాలూరి పేరిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి

శావల్యాపురం: ఎస్సీ వర్గీకరణ సాధించే పోరాటంలో భాగస్వామ్యం అయి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎంఆర్‌పీఎస్ వినుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లావరపు రాజశేఖర్ అన్నారు. మండలంలోని కారుమంచి గ్రామం ఎస్సీ కాలనీలో మండల, గ్రామ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈనెల రెండవ వారంలో తెలంగాణా రాష్ట్రం హైదరాబాదులో జరగనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఎంఎస్ఎఫ్ మండల నూతన ఉపాధ్యక్షునిగా మల్లావరపు సన్నీని నియామకం చేసినట్లు రాజశేఖర్ తెలిపారు.

గణపయ్య స్వామి కానుకల లెక్కింపు

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల మార్గ మధ్యలో ఉన్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి తులసీదాస్, కమిటీ సభ్యుల సమక్షంలో గత 29 రోజులుగా ఆలయానికి హుండీ ద్వారా సమకూరిన ఆదాయం లెక్కించగా, రూ.45,401లు నగదు భక్తులు హుండీలో వేసినట్లు తెలిపారు. భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం



గర్భిణులు, బాలింతలకు టేక్ హోం పోషణ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ

బొల్లాపల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణలో మండలంలోని గుమ్మనంపాడు, షోలాయపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ రేషన్ కిట్లను శుక్రవారం అందజేశారు. ఎంపీపీ బత్తిరాములు చేతులు మీదుగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, వేరుశనగ చిక్కీ, బెల్లం, కర్జూరాలు వంటివి పోషణలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యదాయకమని ఎంపీపీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు రాకుండానే ఇంటికి రేషన్ అందజేయడం సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.శ్రీదేవి, సచివాలయ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం, మర్రిచెట్టుపాలెం, ఎడ్వర్డ్‌పేట, రొంపిచర్ల, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కొనకంచివారిపాలెం గ్రామంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆ గ్రామ సర్పంచ్ పునుగోటి నాసరరావు పాల్గొని టేక్ హోం రేషన్ సరుకులను అందజేశారు. ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, చిన్నపల్లిల కోసం పలు సౌకర్యాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మర్రిచెట్టుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్ అమరోజు గోవిందయ్య, ఎడ్వర్డ్‌పేటలో సర్పంచ్ జిడ్డు ఎర్రయ్య, అంగన్‌వాడీలు వి.పద్మ, కె.అరుణ, ఏఎన్ఎంలు తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఇక్కుర్రు సొసైటీ సేవాతత్పరతకు అవార్డు



మంత్రి కాకాణి గోవర్థనరెడ్డి నుంచి అవార్డు అందుకున్న ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్ కె. శ్రీనివాసరావు

నరసరావుపేట: మండలంలోని ఇక్కుర్రు పీఏసీఎస్ సేవాతత్పరతను గుర్తించి ఆప్కాబ్ వజ్రోత్సవాలలో శుక్రవారం అవార్డు అందజేశారు. ఈ అవార్డును విజయవాడలోని ఎ1-కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర సహకార సహాయ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి చేతుల మీదుగా ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్ కన్నెబోయిన శ్రీనివాసరావు, సీఈవో కంటు శ్రీనివాసరావులు అందుకున్నారు. ఇక్కుర్రు సొసైటీ ఉత్తమ సేవా అవార్డు అందుకోవటం పట్ల పలువురు సొసైటీల చైర్‌పర్సన్‌లు, సీఈవోలు అభినందించారు.

అభినందించిన వారిలో చైర్‌పర్సన్‌లు పోలకొమ్మ వెంకటరెడ్డి, చిన్నపరెడ్డి శివారెడ్డి, ద్రోణాదుల చిన రమణారెడ్డి, మేడికొండ వీరారెడ్డి, వట్టికొండ ఆంజనేయులు, పొలిమేర వెంకటరెడ్డి, కేతు పెదచౌడారెడ్డి, చింతగుంట అంజిరెడ్డి, సీఈవోలు పొలిమేర వెంకటరెడ్డి, నంద్యాల వీరారెడ్డి, మహిపతి రామాంజనేయులు, భవనం వెంకటేశ్వరరెడ్డి, కనకా శివారెడ్డి, గానునపంట వీరారెడ్డి, మేడికొండ వెంకటేశ్వరరెడ్డితో పాటు పలువురు సొసైటీల సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ వైఎస్సార్ అవార్డుకు దరఖాస్తులకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైమ్ అవార్డు–2023 కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, వ్యాపారం, విద్య, వైద్యం, సివిల్ సర్వీసెస్, క్రీడలు తదితర రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు అందించిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రభుత్వ వైబ్‌సైట్ ద్వారా పంపాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నరసరావుపేట: రావిపాడు గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం చేసే క్రమంలో ఎస్ఎస్–3 పరిధిలో ప్రాంతాలకు శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావిపాడు, పాలపాడు, ఇక్కుర్తి, పట్టణంలోని రామిరెడ్డిపేట, స్టేషన్‌రోడ్డు కలెక్టర్ కార్యాలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

ఓటర్ల జాబితా సర్వే పూర్తి చేయాలి

ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్. కల్పశ్రీ

నరసరావుపేట: మున్సిపల్ పరిధిలోని సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ కోసం చేపట్టిన సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్, ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్. కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన సర్వే ప్రక్రియను సజావుగా పూర్తిచేసే విధానంపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకుని, ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎన్నికల నిర్వహణ అధికారులకు వెంటనే తెలియజేసి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల పోలింగ్ బూత్ ఏజెంట్లను భాగస్వామ్యం చేసి ఎటువంటి అనుమానాలు తలెత్తినా నివృత్తి చేయాలన్నారు. జాబితా తయారీలో మార్పులు, చేర్పులు, ఇంటి నంబర్లు, చనిపోయిన వారి పేర్లు తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, పోలింగ్ బూతుల వారీగా ఓటర్ల పేర్లు నమోదు తదితర అంశాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్దిష్ట కాలపరిమితి లోపు ఎన్నికల జాబితా యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. మున్సిపల్ శాఖ అధికారులు, పోలింగ్ బూత్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డాక్టర్ భారతికి నగదు పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పేదరికానికి ఎదురొడ్డి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన సాకే భారతిని శ్రీనాథ కళాపరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి నగదు పురస్కారంతో సత్కరించారు. నరసరావుపేట నుంచి నాగులగడ్డ వెళ్లిన చినరామిరెడ్డి తన మిత్రుల సహకారంతో రూ.30 వేలు సేకరించి శుక్రవారం భారతికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ,వార్డు సచివాలయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వినుకొండ (నూజెండ్ల): గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని వెల్లటూరు రోడ్డు గుడ్‌షపర్డ్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. వినుకొండ టౌన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణానికి చెందిన దుర్గా ప్రసాద్ (23), నరసింహ, అనిల్ ద్విచక్ర వాహనంపై వెల్లటూరు రోడ్డు నుంచి వినుకొండ వస్తుండగా గుడ్‌షపర్డ్ పాఠశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో దుర్గా ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మరో యువకుడు అనిల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మ దేవాలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా భక్తులు పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేంద్ర సర్కారును గద్దె దించాలి

చిలకలూరిపేట: అన్ని వర్గాల ప్రజల హక్కులు హరించి వేస్తూ నిరంకుశ విధానాలతో పాలన కొనసాగిస్తున్న మోదీ సర్కారును గద్దె దించటానికి కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. ఈ నెల 9 తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో ప్రచార జాతాను శుక్రవారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు క్విట్ మోదీ, సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



క్రీడా పరికరాలు వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు అభ్యున్నతికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1997–98 పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ. 25 వేలు విలువ చేయు క్రీడా పరికరాలు వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో తమవంతు సహకారం అందించటం పలువురికు ఆదర్శమని హెచ్ఎం అభినందించారు. అనంతరం క్రీడా పరికరాలు వాలీబాల్స్, త్రోబాల్స్, రింగ్స్, నెట్స్, స్కిపింగ్, చెస్, కారమ్స్ తదితర పరికరాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ప్రతినిధులు ముండ్రు బ్రహ్మయ్య, మర్రి దుర్గారావు, చెవల చినకోటేశ్వరరావు, ఎస్.రామారావు, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వర రావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, భువనేశ్వరీ, నిర్మల, వెంకటరత్నం పాల్గొన్నారు.


గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం



బాధితుడికి నిత్యావసరాలు అందిస్తున్న వీఆర్వోలు

నాదెండ్ల: వంట గ్యాస్ లీకై పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని సాతులూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తాటిగిరి ప్రకాశరావు కథనం ప్రకారం.. ఉదయం 7 గంటల సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో చూస్తుండగానే పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట అగ్నిమాపక దళ అధికారి ఎంవీ సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానిక వీఆర్వోలు మురళీకృష్ణ, అంజలి వివరాలు నమోదు చేసుకుని బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందించారు.

హోమియో వైద్యంతో దీర్ఘకాలిక రోగాలు దూరం



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు

యడ్లపాడు: దీర్ఘకాలిక వ్యాధి సమస్యలకు శాశ్వత పరిష్కారం హోమియో వైద్యం అని తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు రచ్చబండ సెంటర్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన శ్రీవల్లీ హోమియో కేర్ వైద్యశాల వైద్య నిపుణులు పీవీ సునీల్ కుమార్ ప్రారంభపు సమావేశంలో హోమియో వైద్యం వాటి ప్రయోజనాలపై రోగులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధులు వాటి లక్షణాలు, హోమియో వైద్యంతో నివారణకు చేయాల్సిన చర్యలు వంటివి వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో వైద్య విధానం ద్వారా మాత్రమే నయం చేయవచ్చన్నారు. అనంతరం 160 రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందుల్ని అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, ఎడ్లపాడు మండల అధ్యక్షురాలు చెరుకూరి సృజన, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, పోపూరి సుబ్బారావు, ఎస్.సుందరబాబు, షేక్ కరీమూన్, డా.ప్రతిమ, జి. ప్రశాంత్ రెడ్డి, గోపి, మర్రి భాస్కర్, సాగి మల్లికార్జున్, కార్చిల స్వప్నకుమార్, చుక్కా విన్సెంట్‌పాల్ తదితరులున్నారు.

గ్రామీణుల చెంతకు బ్యాంకు సేవలు

ఎస్‌బీఐ ఆర్ఎం ఎస్. సుబ్రమణ్యం



ఆర్ఎంను సత్కరిస్తున్న గ్రామస్తులు

బొల్లాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు విస్తరింపజేయడంలో భాగంగా బ్యాంకు శాఖ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం ఎస్.సుబ్రమణ్యం అన్నారు. మండల కేంద్రం బొల్లాపల్లిలో ఎస్‌బీఐ బ్యాంకు శాఖ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు అవసరాల నిమిత్తం గ్రామాల నుంచి పట్టణాలకు రావాల్సి వస్తున్న దృష్ట్యా గ్రామాల్లో బ్యాంకు సేవలు విస్తరింపజేశామని తెలిపారు. బ్యాంకు సేవలను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. సేవలు సులభతరంగా, సౌలభ్యంగా ఉంటాయని చెప్పారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. దినేష్, బ్రాంచి మేనేజర్లు డి. హరి, వి. ఆనందరావు, సిబ్బంది, నూతన ఖాతాదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గురప్పనాయుడుపాలెం సొసైటీ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు



పారా వెంకటేశ్వర్లును అభినందిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం గురప్ప నాయుడుపాలెం సొసైటీ చైర్మన్‌గా జడ్డవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పారా వెంకటేశ్వర్లు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ పరిధిలోని రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన పారా వెంకటేశ్వర్లును నూజెండ్ల సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు జడ్డా రామయ్య, జక్కిడిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్‌లు ముత్తినేని సుబ్బారావు, గోగులమూడి పున్నారావులు సన్మానించారు.